# 71. నమ్మక 'హరామ్'

నాలుగేళ్ల కిందట మా ఊళ్లో ఒక ప్రభుత్వ రంగ సంస్థ తాలూకు సాంస్కృతిక సంఘం నాకు సన్మానం చేస్తామని ఆఫర్ చేశారు. "నాకు పర్స్ ప్రెజెంటేషన్స్ మీద తప్ప సన్మానాల మీద నమ్మకంలే"దన్నాను. వినిపించుకున్నారు కాదు. మా ఆవిడ ఊళ్లో లేదు; తను లేకుండా నేను సన్మానం చేయించుకోవడం ఇష్టంలేదన్నాను. ఆవేళటికి ఆవిణ్ణిరమ్మని ఉత్తరం రాసేయండి; ఇద్దర్నీ స్టేజెక్కిస్తాం అన్నారు.

సన్మానం జరిగిన రోజున నేను సన్మానసభనుంచీ, మా ఆవిడ రైలు స్టేషన్నుంచీ వేరే వేరే రిక్షాల్లో వచ్చి సరిగ్గా మా ఇంటి దగ్గరే కలుసుకున్నాం. "నా ఉత్తరం అందలేదా?" అని నేను పలకరించాను. "ఉత్తరం ఏదీ అందలేదు గానీ ఆ వేషమేమిటి? అవ్వ్వ! ఆ పువ్వుల దండ, ఆ శాలువా; హు! ఆ చేతిలో ఏమిటి ఏదో; లేపాక్షి బొమ్మలా ఉందే! ఎంత డబ్బు తగలేసేరు, వీటన్నిటికీని?" అని ఆవిడ పలకరించింది.

"డబ్బు తగలెయ్యడమేమిటి; నీ మొహం! నాకివాళ సన్మానం చేసేరు." అన్నాను.

"సన్మానమా! అదేదో గొప్ప పన్లు చేసిన వాళ్లక్కదా, చేస్తారు!"

తలుపు తాళం తియ్యడం, ఎవరు తెచ్చిన సామాన్లు వాళ్లు ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టడం అవుతూండగానే ఈ డైలాగులు కూడా అయ్యేయి. మా ఆవిడ శాలువాని (ఆఖరికి పువ్వుల దండనీ కూడా) వొదిలేసి ఆ లేపాక్షి బొమ్మ అందుకుంది.ఆ బొమ్మనీ, నన్నూ మార్చి మార్చి చూసి "సిగ్గులేకపోతే సరి" అని ఆ బొమ్మని విసిరేసినంత పనిచేసింది.

"ఇప్పుడేం జరిగిందనీ, నీ ఇదీ?" ధోరణిలో నేనేదో మాట్లాడబోయాను. "ప్రఖ్యాత రచయిత, సుప్రసిద్ధ నటుడు శ్రీ గొల్లపూడి మారుతిరావుకు సన్మానం అని దానిమీదుంది..... నాకు ఆ మాత్రం అక్షరాలు రాకపోతే ఇంకా ఎంత మాయచేద్దురో!" అంది. నేను లేచి హడావుడిగా వెళ్ళి మంచంమీద ఉన్న ఆ బొమ్మ తీసి చూశాను. బొమ్మని ఫిక్స్ చేస్తూ కింది భాగంలో ఉన్న కర్ర స్టాండ్ మీద అలాగే రాసుంది.

"అయ్యో, అయ్యో, అతని బొమ్మా, నా బొమ్మా మారిగిళ్ళయి పోయినట్టున్నాయి." అని అంతకి మించి మాటరాక చేరబడిపోయేను.

"ఏముందీ? ఆయనకే సన్మానం చేసుంటారు. చిన్నప్పట్నించీ తెలుసు కదా అని మీరూ వెళ్లుంటారు. ఈ బొమ్మలూ, ఈ శాలువా నా కెందుకూ, మా ఇంటినిండా ఇలాంటివి వందలకొద్దీ ఉన్నాయి; ఇవి నువ్వు పట్టుకుపో అని ఇచ్చేసుంటారు. నువ్వు మెడ్రాసు వెళ్లేలోగా ఈ దండ వాడిపోతుంది కనుక అది కూడా నాకే ఇచ్చివోయి అని దండ మీరే అడిగి తెచ్చేసుంటారు. పోనీలెండి. ఏదో అయిపోయింది. శాలువా ఒడియాలు పెట్టుకునేందుకు బాగానే ఉంది. బొమ్మ కింద ఉన్న అక్షరాలు కిరసనాయిలో, పెట్రోలో వేసి చెరిపేసుకుంటే మనమే ఏ యజ్ఞమిషన్‌లోనో కొనుక్కున్నాం అనుకుంటారు. డబ్బులు దండుగ పెట్టకుండా ఏదో సంపాదించేరు. నయమే" అని మా ఆవిడ కాంప్రమైజ్ అయిపోయింది; మంచంమీద ఆవలిస్తూ పడుకుని.

రెండు వందల మైళ్ల ప్రయాణం చేసొచ్చింది కదా; పది రోజుల్నుంచీ వంటింట్లో ఏది ఎక్కడ

ఉందో తెలీదు కదా, అని- నేనే ఆ పూటకి వంట చేసి వడ్డిస్తూ; ఆ సంఘం వాళ్లు మా ఇద్దరికీ సన్మానం చేసేరనీ, ఇద్దరికీ స్థాయి ఒకటే అని తెలిసేందుకు ఇద్దరికీ ఒకలాంటి శాలువాలే, ఒక్కలాంటి బొమ్మలే ఇచ్చేరనీ, యాదృచ్ఛికంగా బొమ్మలు తారుమారు అయి ఉంటాయనీ నచ్చజెప్పబోయాను. "పోన్లెండి; ఏదో అయిపోయింది. ఇప్పుడు ఏం అనుకుని ఏం లాభం?" అంది.

ఇంట్లో ఆడది లేని సమయం చూసి పువ్వులు (దండ) తేవడం గురించి ఏమీ అనలేదు కదా అని నేనూ అప్పటికి కాంప్రమైజ్ అయిపోయాను.

మర్నాడు ఆ ప్రభుత్వ రంగ సంస్థ సాంస్కృతిక సంఘం కార్యదర్శికి ఫోన్ చేసేను.

"అమ్మయ్య. దొరికారా! నయమే. మారుతిరావు గారు బెజవాడ దాకా వెళ్లేక చూసుకున్నారట. మీ కిచ్చిన బొమ్మ ఆయన ఇవాళ మెయిల్లో ఇక్కడికొస్తున్న రంగనాథం గారికి ఇచ్చి పంపిస్తున్నారు. మీరు సాయంకాలం నాలుగింటికి మీ దగ్గిరున్న బొమ్మ పట్టుకుని మా ఆఫీసుకి రండి. అది నాకు ఇచ్చేసి మీ బొమ్మ మీరు పట్టుకుపోదురుగాని" అన్న మెసేజితో నా బుర్రమీద్ది బోల్డు లగేజీ దిగిపోయింది.

ఆఫీసులో గంట పెర్మిషన్ పెట్టినా రెండు గంటలు ముందుగా బయల్దేరి ఇంటికొచ్చేను. మా ఆవిడ బజారు కెళ్లింది. నేనొస్తే తాళం ఇమ్మని పొరుగావిడకి చెప్పిందట. చకాచకా ఇంట్లో కెళ్లి మారుతిరావు పేరూ అదీ ఉన్న ఆ బొమ్మ తీసుకుని సంచిలో పెట్టుకున్నాను. ఇంటికి మళ్లా తాళం పెట్టి "మా ఆవిడొస్తే ఇవ్వండి" అని పొరుగావిడకి ఇచ్చేను. ఆ ఆఫీసుకి వెళ్లి పని పూర్తిచేసుకుని వెంటనే ఇంటికొచ్చేను. అప్పటికీ మా ఆవిడ బజార్నించి రాలేదు.

నా పేరూ ప్రఖ్యాతీ రాసున్న ఆ బొమ్మని ధైర్యంగా టీవీ మీద ప్రదర్శించి పెట్టేను. బజారంతా తిరిగి షాపులన్నీ కొంచెం కొంచెం చొప్పున కొనేసి అలిసిపోయి వస్తుంది కదా అని మా ఆవిడ కోసం కాఫీ చేసి ఫ్లాస్కులో పోసేను. (నేను కూడా కొంచెం తాగేను; ఉన్న మాట చెప్పాలి కదా!)

మా ఆవిడ ఇంటికొచ్చేక కాఫీ అందిస్తూ టీవీ మీద ఉన్న బొమ్మవేపు వేలు పెట్టి చూపించేను. "గూట్లో ఎక్కడో పెట్టీవలసింది, కొన్నాళ్లపాటు!" అంటూ దగ్గరిగా వెళ్లి, దాని మీదున్న అక్షరాలు చదివింది.

"ఏమిటేమిటీ!"అంది, కళ్లు ఎగరేసి.

"మరేమిటనుకున్నావు!" అన్నాను.

"నేను బజారుకెళ్లినప్పుడు లేవు, ఈ అక్షరాలు ఇలాగ...అంటే సరిగ్గా గంటన్నరటైములో బలే బాగా మేనేజ్ చేసేరే!" అంది.

"మేనేజ్ చెయ్యడమేమిటి?"

"అదే. ఆ అక్షరాలు రాసిన వాడెవడో వాణ్ణి వెతికి పట్టుకుని, అక్కడికి ఈ బొమ్మ తీసికెళ్లి, అంది మీదున్న పాత అక్షరాలన్నీ చెరిపించి, మీ పేరూ అవన్నీ రాయించి మళ్లీ నాకన్నా ముందే ఇంటికొచ్చి...."

"అంతేగాని నిన్న నాకు సన్మానం జరిగినట్టు నువ్వు నమ్మవన్నమాట?" అన్నాను.

"పోనీ, నమ్ముతాన్లెండి. మిమ్మల్ని నమ్మకపోతే ఇంకెవర్ని నమ్ముకోవాలి!" అంది మా ఆవిడ; కొంతసేప్పోయేక, నాతో ఏదో అవసరం పడి.

★